
ఈనాడు మహబూబ్‌నగర్

బుధవారం అక్టోబరు 2, 2024 7

వక్ఫ్ భూముల పరిరక్షణపై దృష్టేదీ..!

పాలమూరులో ఏడు వేల ఎకరాల్లో ఆక్రమణలు



మహబూబ్‌నగర్‌లో ఓ ప్రాంతంలో వక్ఫ్‌భూములు అంటూ ఏర్పాటు చేసిన బోర్డు

ఈనాడు, మహబూబ్ నగర్: పాలమూరులో వక్ఫ్ భూముల ఆక్రమణలకు అడ్డుకట్ట పడటంలేదు. పూర్వ మహబూబ్‌నగర్‌లో 4,561 సంస్థలకు 11,500.18 ఎకరాల్లో వక్ఫ్ భూములున్నాయి. వీటిలో సుమారు ఏడు వేల ఎకరాలకుపైగా భూములు అన్యాక్రాంతమైనట్లు గతంలోనే వక్ఫ్ బోర్డు గుర్తించింది. ఉమ్మడి జిల్లాలో 1,592 చిల్లాలు, 1,523 అసూర్‌ఖానాలు, 766 ఖబర్‌స్థాన్‌లు, 297 మజీదులు, 223 దర్గాలు, 160 ఇతర సంస్థలకు ఈ భూముల కేటాయింపులు జరిగాయి. ప్రస్తుతం వీటిలో సగానికిపైగా భూములు వివిధ ప్రాంతాల్లో కబ్జాల్లో ఉన్నాయి. వీటి పరిరక్షణలో వక్ఫ్ బోర్డు ఉదాసీనత ప్రదర్శిస్తుండటంతో ఈ స్థలాల్లో స్థిరాస్తి వ్యాపారాలు, ఇతర నిర్మాణాలు జరుగుతున్నాయి. పెద్ద భవంతులను నిర్మిస్తున్నారు. నిబంధనల ప్రకారం వక్ఫ్ భూముల క్రయవిక్రయాలు చేయకూడదు. ఉమ్మడి జిల్లాలో ఇవేవీ అమలు కావడం లేదు. తరచూ ఏదో ఒక ప్రాంతంలో ఈ భూములపై వివాదాలు నెలకొంటున్నాయి.

ఉమ్మడి జిల్లాలో..

ఉమ్మడి జిల్లాలో వక్ఫ్ భూములు పలు ప్రాంతాల్లో ఇతరుల చేతుల్లోకి వెళ్లిపోయాయి. ముఖ్య ప్రజాప్రతినిధులు, స్థానిక నేతల సహకారంతో పలుచోట్ల ఈ భూములను రికార్డుల్లోనూ లేకుండా చేస్తున్నారు. భూములు కబ్జా అయినట్లు గుర్తించిన వక్ఫ్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.


- మహబూబ్‌నగర్ ప్రధాన రహదారిపై రెండు సర్వే నంబర్లలో 13 ఎకరాల్లో వక్ఫ్ స్థలాలున్నాయి. ప్రస్తుతం ఆ ప్రాంతంలో సగానికిపైగా ఆక్రమణలకు గురయ్యాయి. మిగతా స్థలాల్లోనూ ఇతరుల కన్ను పడింది. తొలుత చిన్నపాటి షెడ్డులు వేసుకుని తర్వాత ఇళ్లను నిర్మించుకుంటున్నారు. ఇక్కడ ఎకరా విలువ సుమారు రూ.2 కోట్లకుపైగానే ఉంటుంది.
- నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలంలో మొత్తం 460 ఎకరాల్లో వక్ఫ్ భూములున్నాయి. ఊట్కూరు, పులిమామిడి, కొల్లూరు, నిడుగుర్తి, పెద్దజట్రంలో ఈ భూములున్నాయి. కేవలం ఊట్కూర్‌లోనే 328 ఎకరాల్లో వక్ఫ్ స్థలాలుండగా ఇప్పటికే పలు భూములు అన్యాక్రాంతమైనట్లు సమాచారం. గతంలో ఈ భూములను కొందరు స్థిరాస్తి వ్యాపారికి విక్రయానికి పెట్టడం వివాదాస్పదమైంది. తర్వాత కూడా ఈ భూములను అధికారులు పట్టించుకోవడం మానేశారు.
- వనపర్తి జిల్లా అమరచింతలోని ఓ దర్గాకు వివిధ సర్వే నంబర్లలో 60 ఎకరాలకుపైగా స్థలాలున్నాయి. ఈ భూముల్లో సగానికిపైగా అన్యాక్రాంతమయ్యాయి. ఆక్రమణలపై గతంలో రెవెన్యూ అధికారులు విచారణ చేసినా ఫలితం లేకపోయింది.
- గద్వాల పట్టణంలోనూ వక్ఫ్ భూముల్లో నిర్మాణాలు చేపట్టారని కొందరు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు. ఇప్పటి వరకు ఎలాంటి విచారణ జరగలేదు. నాగర్‌కర్నూల్ జిల్లాలోనూ కొన్నిచోట్ల వక్ఫ్ స్థలాలు కనిపించడం లేదు.

పూర్తిస్థాయిలో సర్వే చేస్తే..

వక్ఫ్ భూములపై అధికారులు పూర్తిస్థాయిలో సర్వే చేయడం లేదు. సర్వే చేసి హద్దులు గుర్తించి బోర్డులు ఏర్పాటు చేయాలి. వక్ఫ్ ఇన్‌స్పెక్టర్లు ఈ భూములపై నిరంతరం నిఘా పెట్టాల్సి ఉన్నప్పటికీ ఉమ్మడి జిల్లాలో ఎక్కడా అమలు కావడం లేదు. మహబూబ్‌నగర్ అదనపు కలెక్టర్(రెవెన్యూ) మోహన్‌రావు మాట్లాడుతూ వక్ఫ్ భూముల పరిరక్షణ కోసం కమిటీల వివరాలు కావాలని ఇటీవలే ఉన్నతాధికారులు కోరారన్నారు. ఈ భూముల పరిరక్షణకు అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. 90శాతం భూములు గెజిట్‌లో ఉన్నాయని, వీటిని అన్యాక్రాంతం చేయడానికి వీలు లేదన్నారు.

బస్టాండులో నాలా తొలగింపునకు అడుగులు

● రూ.2 కోట్ల అంచనాతో ఈఎన్‌సీకి ప్రతిపాదనలు


బస్టాండు నుంచి పెద్దచెరువు వైపు నాలా దారి మళ్లించే ప్రదేశాన్ని పరిశీలిస్తున్న పురపాలిక ఈఈ బస్వరాజ్

ఈనాడు మీ తోడు

మహబూబ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రంలోని బస్టాండులో ప్రయాణికులకు దుర్గంధం వెదజల్లుతూ, ఆర్టీసీ ఉద్యోగులకు ప్రాణ సంకటంగా పరిణమించిన పెద్దచెరువు మురుగు నాలా తొలగింపునకు అడుగులు పడుతున్నాయి. ఈ మురుగు నాలాపై 'ఈనాడు'లో వరుస కథనాలు ఇస్తున్న నేపథ్యంలో ఆర్టీసీ ఆర్ఎం శ్రీదేవి, డీఎం సుజాత ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, డిపో ఉద్యోగులు అనారోగ్యాల బారినపడుతున్న వైనాన్ని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన మురుగు కాల్వ దారి మళ్లించే విషయమై పురపాలక ఛైర్మన్ ఆనంద్‌కుమార్ గౌడ్‌కు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలని సూచించారు. ఎమ్మెల్యే సూచనతో ఇటీవల పురపాలక అధ్యక్షుడు ఆనంద్‌కుమార్‌గౌడ్, కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి ప్రయాణ ప్రాంగణం గుండా ప్రవహిస్తున్న పెద్దచెరువు నాలా దుస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించారు. ఆ తర్వాత పురపాలక ఈఈ బస్వరాజ్, వారి ఇంజినీరింగ్ బృందంతో ఆర్టీసీ ప్రాంగణం గుండా ప్రవహిస్తున్న నాలాను పరిశీలించారు. అంబేడ్కర్‌నగర్, పీర్లబావి వైపు డిపో వెనక ప్రదేశాన్ని కూడా పరిశీలించి నాలాను ఎక్కడి నుంచి ఎలా దారి మళ్లించాలో ఒక అంచనాకు వచ్చారు. అంబేడ్కర్‌నగర్ సామాజిక భవనం వద్ద బస్టాండు వైపు పెద్దచెరువు నాలా దారి మళ్లిన విషయం తెలిసిందే. నాలా మొత్తం బస్టాండు ఆవరణ గుండా వెళ్లకుండా చర్యలు చేపడతారు. బస్టాండు ప్రహరీ లోపల 3 మీటర్ల విస్తీర్ణంతో 2 మీటర్ల లోతుతో డిపో ప్రహరీ వెనక భాగం గుండా పీర్లబావి వైపు దారి మళ్లిస్తారు. ఇలా 300 మీటర్ల వరకు నాలాను పొడిగిస్తూ పెద్దచెరువు వరకు నిర్మిస్తారు. ఈ పనుల కోసం రూ.2కోట్ల నిధులు అవసరమని ఈఈ బస్వరాజ్ అంచనా వేశారు. ఈ నివేదికను గత నెల రెండో వారంలో అటు ప్రజారోగ్యశాఖ ఈఎన్‌సీకి, ఇటు సీడీఎంఏకు పంపించారు. నిధులు మంజూరైన వెంటనే బస్టాండు గుండా ప్రవహిస్తున్న నాలాను దారి మళ్లించే పనులు చేపడతామని ఈఈ 'న్యూస్‌టుడే'కు తెలిపారు.


డిపో ప్రహరీ పక్క నుంచి పెద్దచెరువు వైపు నాలా పొడిగిస్తూ నిర్మించాల్సిన ప్రదేశం

నల్లమలలో జంగిల్ సఫారీ ప్రారంభం

మన్ననూరు(అమ్రాబాద్), న్యూస్‌టుడే : అమ్రాబాద్ పెద్దపులుల అభయారణ్యంలోని జంగిల్ సఫారీని ఫర్హాబాద్ గేట్ వద్ద వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ మంగళవారం పునఃప్రారంభించారు. 3 కొత్త పర్యాటక వాహనాలను అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నల్లమలలో పర్యాటకాభివృద్ధికి ముఖ్యమంత్రి పెద్దపీట వేస్తున్నారని చెప్పారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విదేశీ పర్యాటకులను ఆకర్షించేలా అమ్రాబాద్ టైగర్ రిజర్వు ఫారెస్టును తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని వివరించారు. జిల్లా అటవీ శాఖాధికారి రోహిత్‌గోపిడి, ఎఫ్‌డీవో రామమూర్తి, ఫ్లయింగ్ స్క్వాడ్ ఎఫ్‌డీవో రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.


సఫారీని ప్రారంభిస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ, చిత్రంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ

బసవతారకం ఆస్పత్రిలో మహిళలకు ఉచితంగా పరీక్షలు

బంజారాహిల్స్, న్యూస్‌టుడే: బంజారాహిల్స్‌లోని బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రిలో అక్టోబరు 1 నుంచి 20వ తేదీ వరకు మహిళా క్యాన్సర్ రోగులకు ఉచిత కన్సల్టేషన్ ఉంటుందని ఆసుపత్రి వర్గాలు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపాయి. అక్టోబర్‌ను రొమ్ము కాన్సర్ అవగాహన మాసంగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో 'స్క్రీనింగ్ ప్రోగ్రామ్ ఫర్ ఉమెన్' పేరిట ఈ సౌకర్యం కల్పించినట్లు పేర్కొన్నారు. అన్ని పనిదినాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కన్సల్టేషన్ ఉంటుందని, మ్యామోగ్రామ్ పరీక్షల్లో 25 శాతం రాయితీ, ఇతర పరీక్షల్లో 10 శాతం రాయితీ ఇస్తున్నట్లు వెల్లడించారు. వివరాలకు 040-23551235, 23550967 నంబర్లను సంప్రదించవచ్చని సూచించారు.


మైసమ్మ దేవత

3 నుంచి మైసమ్మ దేవాలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు

నవాబ్‌పేట, న్యూస్‌టుడే : నవాబ్‌పేట మండలం కాకర్లపహాడ్ గ్రామ సమీపంలోని పర్వతాపురం మైసమ్మ దేవాలయంలో ఈనెల 3 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఈవో మధనేశ్వర్‌రెడ్డి తెలిపారు. 3న గణపతిపూజ, అఖండ దీపారాధన, కలశస్థాపన, ధ్వజారోహణం, 4న శ్రీచక్ర పూజ కైంకర్యం, 5న పంచామృతాభిషేకం, అలంకరణ, 6,7,8న నిత్యకైంకర్యంతో పాటు అమ్మవారి పూజ, 9న సరస్వతిపూజ, 10న ఆయుధపూజ, 11న మహర్నవమి దేవి పూజ, 12న అమ్మవారికి అభిషేకం, అలంకరణ, దేవతారాధన సాయంత్రం శమిపూజ, ధ్వజ అవరోహణం, కార్యక్రమ సమాప్తి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

వెయ్యి టీఎంసీలకు చేరువలో..

ధరూరు, న్యూస్‌టుడే: జూరాల ప్రాజెక్టుకు గత 16 ఏళ్ల వ్యవధిలో వచ్చిన వరదను పరిశీలిస్తే ఇప్పటి మూడు సార్లు మాత్రమే వెయ్యిటీఎంసీలు దాటింది. ఈ ఏడాది మరో నాలుగైదు రోజుల్లో నాలుగో సారి వరద వెయ్యి టీఎంసీలు దాటనుంది. జులై 19 తేదీ ప్రాజెక్టుకు వరద మొదలైంది. ఆగస్టు చివరి వారంలో అత్యధికంగా 3.89 లక్షల క్యూసెక్కులు నమోదైంది. 75 రోజుల వ్యవధిలో జూరాలకు 950.70 టీఎంసీల వరద చేరింది. మంగళవారం జూరాలకు 95వేల క్యూసెక్కుల వరద కొనసాగుతోంది.


జూరాల ప్రాజెక్టు వద్ద వరద (పాతచిత్రం)

ఏడాది	వరద (టీఎంసీల్లో)
2015-16	45
2016-17	378
2017-18	315
2018-19	1460
2019-20	1425
2020-21	866
2021-22	820
2022-23	1236
2023-24	155
2024-	950

(అక్టోబర్ 1 తేదీ వరకు)

ఎంవీఎస్ కళాశాలకు మహర్దశ

రూ.10కోట్లతో త్వరలో పీజీ విద్యార్థినుల వసతిగృహం నిర్మాణం



మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల

న్యూస్‌టుడే, పాలమూరు : ఉమ్మడి జిల్లాకే కీలకమైన మహబూబ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ ఎంవీఎస్ డిగ్రీ, పీజీ కళాశాలకు మహర్దశ రానుంది. ఇక్కడి పీజీ విద్యార్థినుల కోసం పీఎం ఉష పథకం కింద రూ.10 కోట్ల నిధులతో బాలికల వసతి గృహం మంజూరైంది. కళాశాలలో 3,910 మంది విద్యార్థులు చదువుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎక్కువ మంది విద్యార్థులు ఉన్న ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలల్లో ఎంవీఎస్ నాలుగో స్థానంలో ఉంది. అందుకే రాష్ట్రంలో ములుగు కళాశాలతో ఎంవీఎస్‌కు పీజీ బాలికల వసతిగృహం మంజూరు చేశారు. దీన్ని కళాశాల ప్రాంగణంలో ఇప్పటికే ఉన్న బాలికల వసతి గృహం పక్కనే రెండు అంతస్తులతో విశాలంగా, ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా నిర్మించనున్నారు. టెండర్ ప్రక్రియ కూడా పూర్తి కావడంతో దసరా తర్వాత పనులను చేపట్టనున్నారు. ఈ భవన నిర్మాణానికి కేంద్రం రూ.6కోట్లు కేటాయించగా, రాష్ట్ర ప్రభుత్వం రూ.4కోట్లను మంజూరు చేసింది.

ఉద్యోగార్థులకు కూడా వసతి : ఎంవీఎస్ కళాశాలలో ఇప్పటికే ఉన్న వసతిగృహంలో డిగ్రీ, పీజీ విద్యార్థినులు ఉంటున్నా అది ఏమాత్రం సరిపోవటం లేదు. కళాశాలలో ఉన్న ఏడు పీజీ కోర్సులను 500ల మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. కొత్త వసతిగృహం నిర్మిస్తే దాన్ని పీజీ విద్యార్థినులకే కేటాయిస్తారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ స్టడీ సర్కిళ్లలో శిక్షణ తీసుకుంటూ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న మహిళలు, విద్యార్థినులకు కూడా ఎలాంటి రుసుము లేకుండా వసతి, భోజనం కల్పిస్తారు. 250 మంది ఉండే నిర్మించే ఈ వసతి గృహంలో ప్రత్యేక గ్రంథాలయం ఏర్పాటు చేసి పోటీ పరీక్షల పుస్తకాలు, పత్రికలు అందుబాటులో ఉంచుతారు. వసతి గృహం ముందు చిన్న ఉద్యానం కూడా ఏర్పాటు చేస్తారు.

100 గదుల ప్రణాళికకు పచ్చజెండా : కళాశాలలో ఏటా కొత్త కోర్సులు మంజూరవుతున్నాయి. విద్యార్థుల సంఖ్య కూడా ఏటికేడు పెరుగుతోంది. ఇప్పటికే ఉన్న తరగతి గదులు శిథిలావస్థకు చేరాయి. ఈ నేపథ్యంలో రూ.70 కోట్ల వ్యయంతో రెండస్థుల్లో 100 తరగతి గదులను నిర్మించడానికి రూపొందించిన బృహత్తర ప్రణాళికకు ప్రభుత్వం నుంచి పాలనాపరమైన అనుమతులు వచ్చాయి. దాతలు, పూర్వ విద్యార్థుల అందించే విరాళాలతో వీటిని నిర్మించాలని కళాశాల యాజమాన్యం యోచిస్తోంది.



అన్ని రంగాల్లో ముందుంచుతాం.. : ఎంవీఎస్ కళాశాలలోనే నేను చదివాను. ఇప్పుడు ఆ ప్రిన్సిపల్‌గా పనిచేయటం గొప్ప అనుభూతి. కళాశాల అభివృద్ధికి నా నెల వేతనంలో సగం ఇస్తాను. నాతో పాటు చాలా మంది సహాయం అందించడానికి సిద్ధంగా ఉన్నారు. అందరి సౌజన్యంతో కళాశాలను అభివృద్ధి చేసి విద్యార్థులకు అన్ని రకాల వసతులన కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నాం. పీఎం ఉష కింద మంజూరైన వసతిగృహం నిర్మాణ పనులు టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీకి ప్రభుత్వం అప్పగించింది.

- కె.పద్మావతి, ప్రభుత్వ ఎంవీఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్


సన్మానం పొందిన వృద్ధులతో కలెక్టర్ విజయేందిర బోయి, అదనపు ఎస్పీ రాములు తదితరులు

వృద్ధులను జాగ్రత్తగా చూసుకోవాలి : కలెక్టర్

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : వృద్ధాప్యం అనేది రెండో దశ బాల్యమని, వృద్ధులను జాగ్రత్తగా చిన్న పిల్లల మాదిరిగా చూసుకోవాల్సిన బాధ్యత కుటుంబ సభ్యులదేనని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో మహిళా,శిశు, వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవంలో ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వృద్ధులను బాగా చూసుకుంటే వారి పిల్లలు కూడా అనుసరిస్తారని తెలిపారు. ఉద్యోగ, వ్యాపార, ఇంటి బాధ్యతల ఒత్తిడితో వృద్ధులతో సరిగ్గా మాట్లాడకపోవటం సరికాదన్నారు. పిల్లలు ఆస్తులు, భూములను బలవంతంగా తమ పేరా రాయించుకోవడం, వారి బాగోగులను పట్టించుకోకపోవడం వంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. కుటుంబ సభ్యుల నుంచి ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా సంరక్షణకు ఆర్డీవో ట్రైబ్యునల్‌ను సంప్రదించాలని, అక్కడ కూడా న్యాయం లభించకుంటే జిల్లా కలెక్టర్‌కు అప్పీల్ చేసుకోవాలని సూచించారు. మండల స్థాయిలో సీనియర్ సిటీజన్ ఫోరం కమిటీలు ఏర్పాటు చేసి సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. వెల్‌నెస్ కేంద్రాన్ని వయోవృద్ధులు కోరిన విధంగా వారికి అందుబాటులో ఉండే చోటికి మారుస్తామని హామీ ఇచ్చారు. ఆస్పత్రుల్లో వైద్య సేవలు అందేలా చూస్తామన్నారు. ఈ సందర్భంగా వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు శివేంద్ర ప్రతాప్, ఎస్.మోహన్‌రావు, జిల్లా సంక్షేమాధికారి జరీనా బేగం, డీఆర్‌డీవో నరసింహులు, పశువైద్య శాఖ సంయుక్త సంచాలకులు మధుసూదన్, సీనియర్ సిటీజన్ ఫోరం అధ్యక్షుడు జగపతి రావు, కార్యదర్శి నాగభూషణం, పింఛనర్ల సంఘం అధ్యక్షుడు సాయిలుగౌడ్, వయోవృద్ధుల ట్రైబ్యునల్ సభ్యుడు నాగేంద్రస్వామి, జడ్చర్ల సీనియర్ సిటీజన్ ఫోరం ప్రతినిధి నయీముద్దీన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్లను సన్మానించారు.

మత్స్యకారులకు అండగా సర్కారు : ఎమ్మెల్యే


దమగ్నాపూర్‌లో చేపపిల్లలను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

దేవరకద్ర గ్రామీణం, న్యూస్‌టుడే : ప్రభుత్వం మత్స్యకారులకు అండగా ఉంటుందని ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి అన్నారు. మంగళవారం చిన్నచింతకుంట మండలంలోని దమగ్నాపూర్ గ్రామంలోని చెరువులో ఆయన చేప పిల్లలను విడుదల చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వర్షాలు సమృద్ధిగా కురవడంతో చెరువులు, కుంటలు కళకళలాడుతున్నాయని పేర్కొన్నారు. ప్రతి చెరువులో చేపపిల్లలను విడుదల చేసి మత్స్యకారులకు అండగా ఉంటామన్నారు. ప్రభుత్వం మత్స్యకారులకు రాయితీపై అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మహిళా సాధికారతకు కృషి

దేవరకద్ర గ్రామీణం : ప్రభుత్వం మహిళా సాధికారతకు కృషి చేస్తుందని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం దేవరకద్రలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మహిళా సమాఖ్య అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ప్రభుత్వం స్త్రీనిధి ద్వారా రుణాలను అందించడంతో పాటు మహిళా శక్తి క్యాంటీన్లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

నేటి నుంచి ఎస్జీటీల ధ్రువపత్రాల పరిశీలన

12 కమిటీలను ఏర్పాటు చేసిన జిల్లా విద్యాధికారి


ప్రధానోపాధ్యాయులకు సూచనలిస్తున్న డీఈవో రవీందర్

పాలమూరు, న్యూస్‌టుడే : డీఎస్సీ-2024 రాత పరీక్ష ఫలితాలను ప్రభుత్వం సోమవారం ప్రకటించటంతో ఎంపికైన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలనపై జిల్లా విద్యాశాఖ అధికారులు దృష్టి సారించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాలలో డీఈవో రవీందర్ 12 కమిటీలను ఏర్పాటు చేశారు. ప్రతి కమిటీలో ఇద్దరు ప్రధానోపాధ్యాయులతో పాటు ఒక కంప్యూటర్ సహాయకుడిని నియమించారు. వాస్తవానికి ఈ నెల 1వ తేదీ నుంచి ధ్రువపత్రాలు పరిశీలించాలని ప్రభుత్వం ఆదేశించింది. 1:3 నిష్పత్తిలో అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ ఆలస్యమైంది. తొలిరోజు ధ్రువపత్రాల పరిశీలన ముందుకు సాగలేదు. ప్రతి పోస్టుకు రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం ఎంపిక చేయాల్సి ఉంటుంది. ఎంపికైన అభ్యర్థుల జాబితాలు డీఈవో కార్యాలయాలకు తొలిరోజు రాలేదు. జిల్లాలో 243 ఉపాధ్యాయ పోస్టులకు 1:3 నిష్పత్తిలో 729 మందిని ఎంపిక చేయాలి. దీనిపై రాష్ట్ర పాఠశాల విద్యా శాఖ సంచాలకుల నుంచి స్పష్టత రాకపోవడంతో విద్యాశాఖ అధికారులు ఆ జాబితా కోసం ఎదురుచూశారు.

రెండు డీఎస్సీల అభ్యర్థులకు నియామకాలు.. : రాష్ట్ర ప్రభుత్వం 2008 డీఎస్సీ అభ్యర్థులకు తాత్కాలిక పద్ధతిలో నియామకాలను చేపడుతున్న తరుణంలో రెండు డీఎస్సీల ప్రక్రియ నిర్వహించాల్సిన బాధ్యత జిల్లా విద్యాశాఖపై ఉంది. ఈ నెల 9వ తేదీన కొత్త డీఎస్సీ వారికి నియామక పత్రాలను అందించాలని సర్కార్ కసరత్తు చేస్తోంది. అప్పుడే 2008 డీఎస్సీ వారికి నియామక పత్రాలు ఇస్తారని వినిపిస్తున్నా దానిపై స్పష్టత లేదు. పాత, కొత్త డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలనకు ఈ నెల 5వ తేదీ వరకే గడువు ఉంది. అనంతరం వారి వివరాలను జిల్లా విద్యాశాఖ అధికారులు అంతర్జాలం ద్వారా రాష్ట్ర పాఠశాల విద్యా సంచాలకులకు పంపిస్తారు. అక్కడ నుంచి నియామక పత్రాలు వస్తే పోస్టింగ్ ఇవ్వనున్నారు. నేటి నుంచి ఎస్జీటీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన జిల్లా కేంద్రంలోని డైట్‌లో నిర్వహిస్తామని డీఈవో రవీందర్ 'న్యూస్‌టుడే'కు వివరించారు. తర్వాత స్కూల్ అసిస్టెంట్ల పోస్టులకు 1:3 చొప్పున ఎంపికైన అభ్యర్థుల పత్రాలు పరిశీలిస్తామని చెప్పారు.


ఎల్ఐసీ ప్రైవేటీకరణ బిల్లు అడ్డుకున్న ఏచూరి

సంస్మరణ సభలో సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎంపీ మధు

మహబూబ్‌నగర్ పట్టణం, న్యూస్‌టుడే : కేంద్రంలోని భాజపా ప్రభుత్వం అప్పట్లో పార్లమెంటులో ప్రవేశపెట్టిన ప్రభుత్వ రంగ సంస్థ ఎల్ఐసీ ప్రైవేటీకరణ బిల్లును సీతారాం ఏచూరి అడ్డుకున్నారని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎంపీ మధు అన్నారు. మంగళవారం మహబూబ్‌నగర్ పట్టణం అంబేడ్కర్ కళాభవన్‌లో సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రాములు అధ్యక్షతన సీపీఎం అగ్రనేత సీతారాం ఏచూరి సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు నిమిషాలు మౌనం పాటించి ఏచూరికి శ్రద్ధాంజలి ఘటించారు. ముఖ్యఅతిథిగా మాజీ ఎంపీ మధు ప్రసంగిస్తూ ప్రణబ్ ముఖర్జీ ఆర్థిక శాఖ మంత్రిగా ఉన్న సమయంలో బీమా ప్రైవేటీకరణ బిల్లును ప్రవేశపెడితే తన వాదనతో వెనక్కి పంపేలా చేశారని పేర్కొన్నారు. ఏచూరి ఎంపీగా పార్లమెంటులో గళమెత్తారని, బయట ప్రజా సమస్యలపై పోరాడి ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చారని పేర్కొన్నారు. ఆయన మరణం వామపక్ష పార్టీలకు, దేశాభివృద్ధికి తీరని లోటన్నారు. ప్రపంచ మార్కెట్‌లో చమురు ధరలు తగ్గినా కూడా కేంద్ర ప్రభుత్వం ఇక్కడ పెట్రో, డీజిల్ ధరలు తగ్గించకపోవడం దారుణమన్నారు. ఐఏఎస్, ఐపీఎస్ వంటి ఉన్నత ఉద్యోగాలను నేరుగా భర్తీ చేసే రిజర్వేషన్లను తొలగించేందుకు కేంద్రం కుట్ర పన్నుతోందని విమర్శించారు. లౌకికవాద భారతదేశంలో ఒక దేశం, ఒకే ఓటు పేరుతో జమిలి ఎన్నికలు తేవాలన్న ప్రధాని మోదీ ఆలోచన సఫలీకృతం కాదన్నారు. ఎమ్మెల్సీ గోరటి వెంకన్న మాట్లాడుతూ సీతారాం ఏచూరి మహాజ్ఞాని అని కొనియాడారు. ఏచూరితో పాటు ఓ వేదిక పంచుకున్నానని, ఈ సందర్భంగా ఆయన భారత తత్వశాస్త్రంపై అనర్గళంగా మాట్లాడారని గుర్తు చేశారు. దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ ఏచూరి మృతి కమ్యూనిస్టు పార్టీలకు తీరనిలోటన్నారు. సభలో పురపాలక సంఘం ఆనంద్ కుమార్ గౌడ్, జేపీఎన్‌సీఈ ఛైర్మన్ కేఎస్ రవికుమార్, సీపీఐ సీనియర్ నాయకుడు కె.రామకృష్ణ, జిల్లా కార్యదర్శి బాలకిషన్, నాయకులు రాంచందర్, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కిల్లె గోపాల్, పద్మ, కురుమూర్తి, చంద్రకాంత్, నాయకులు మోహన్, ప్రశాంత్, నందు, భరత్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో ప్రసంగిస్తున్న మాజీ ఎంపీ మధు

బాపూ మాట.. బంగారు బాట



● అమలు చేస్తే ప్రగతి పరుగులు
● నేడు గాంధీ జయంతి

న్యూస్‌టుడే- అచ్చంపేట, కోస్గి

జాతిపిత మహాత్మాగాంధీ జయంతిని బుధవారం దేశ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించనున్నారు. ఆయన మాటలు సమాజ హితానికి బంగారు బాటలు వేస్తాయి. శాంతి, అహింస సిద్ధాంతాలను నమ్మిన మహాత్ముడు వాటితోనే పోరాటం చేశారు. గాంధీజీ అహింస, మద్యపాన నిషేధం, అంటరానితనం నిర్మూల, గ్రామ స్వరాజ్యం, నిజాయతీ, మత సామరస్యం వంటి సిద్ధాంతాలను ప్రపంచానికి చాటి చెప్పారు.

ఆదర్శం.. అనుసరణీయం

మహాత్ముడు మంచి మార్గం ఎక్కడున్నా అనుసరించాలి


★ **పాలమూరులో ఇలా:** నారాయణపేట జిల్లా ఎక్లాస్‌పూరులో గత 15 ఏళ్లుగా మద్య నిషేధం అమలు చేస్తున్నారు. మాతా మాణికేశ్వరి అహింస, మద్యపాన నిషేధం, శాంతిని భక్తులకు ప్రబోధించే వారు. ఆమె భక్తులు ఇప్పటికీ అనుసరిస్తున్నారు. అచ్చంపేట సమీపంలోని బక్కలింగాయపల్లిలో కూడా సంపూర్ణ మద్య నిషేధాన్ని అమలు చేస్తున్నారు. ఈ గ్రామంలో అత్యధికులు గిరిజనులు ఉండటం విశేషం.

అంటరానితనం అమానుషం

అంటరానితనం అమానుషం. సృష్టిలో అందరూ సమానం. వివక్ష కూడదు.

★ ఇప్పటికీ పూర్తి స్థాయిలో అమలుకు నోచుకోలేదు. కృష్ణా మండలం ముడుమాల్‌లో ఇటీవల దళితుల పెళ్లి అడ్డుకున్నారని ఆలయ పూజారిని విధుల నుంచి తొలగించారు. పోలీసులు, రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో వివిధ గ్రామాల్లో పౌర దినోత్సవాన్ని నిర్వహిస్తూ అంటరానితనాన్ని నిర్మూలించేందుకు కృషి చేస్తున్నారు.

సత్యమేవ జయతే!



మహాత్ముడు నిజాయతీకి మారుపేరుగా నిలిచారు. చేసిన తప్పులను గుర్తించి సరి చేసుకోవడానికి ప్రాధాన్యం ఇచ్చారు.

★ ఉమ్మడి జిల్లాలో ఎన్నో సమస్యలు ఏళ్ల తరబడిగా ఎన్నికల వాగ్దానాలుగా ఉపయోగపడుతున్నాయి. ఎన్నికలు వచ్చినప్పుడల్లా హామీ ఇవ్వడం పరిపాటిగా మారింది. గెలిచిన తరువాత ఎవరూ వాటిని పట్టించుకోవడం లేదు.

అహింసతోనే విజయం

అహింసతోనే విజయాన్ని సాధించవచ్చని మహాత్ముడు ప్రబోధించారు. భారతదేశాన్ని సుమారు వందల ఏళ్లపాటు పాలించిన ఆంగ్లేయుల బారి నుంచి దేశానికి విముక్తి కల్పించేందుకు అహింస మార్గాన్ని ఎంచుకున్నారు.

★ ఎన్నికల ఘట్టంలో గతంలో హింస చెలరేగి రక్తపాతం చోటు చేసుకునేది. ఉమ్మడి పాలమూరు జిల్లాలో గత ఏడాది జరిగిన అసెంబ్లీ, ఈ ఏడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఎలాంటి హింసకు తావు లేకుండా ఎన్నికల సంఘం బాపూజీ ఆశయాలను అమలు చేసి ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడంలో సఫలీకృతమైంది.



ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు (పాత)

మద్య నిషేధంతోనే అభివృద్ధి

మహాత్ముడు మద్యనిషేధంతోనే ప్రగతి సాధ్యమవుతుందని చాటి చెప్పారు. మద్యంతో ఎన్నో అలజడులు చోటు చేసుకుంటున్నాయి. గాంధీజీ బాటలో నడచేందుకు పాలకులు ముందుకు రావాల్సిన అవసరం ఉంది.



★ మద్యం ఉమ్మడి జిల్లాలో ఏరులై పారుతోంది. తిమ్మాజిపేట టీసీబీసీఎల్ నుంచి మద్యం సరఫరా చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 153 మద్యం దుకాణాలు, 23 బార్లు ఉన్నాయి. నెలకు రూ. 150 కోట్ల విలువైన అమ్మకాలు జరుగుతున్నాయి. ప్రత్యేక ఉత్సవాలు, పండగలు, ఎన్నికల సమయంలో అదనంగా మరో రూ. 50 కోట్ల విలువైన మద్యం అమ్ముడవుతోంది. నెలకు 2.09 లక్షల కేసుల మద్యం, 2.51 లక్షల కేసుల బీర్లు అమ్ముడవుతున్నాయి. తాగుడుకు బానిసలై ఎంతో మంది ప్రాణాలు కోల్పోతుండటంతో కుటుంబాలు వీధిన పడుతున్నాయి.

సంపూర్ణ పారిశుద్ధ్యం

మహాత్ముడు సంపూర్ణ పారిశుద్ధ్యంతోనే గ్రామ స్వరాజ్యం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం కేవలం 32.7 శాతం గ్రామీణ గృహాలకు మాత్రమే వ్యక్తిగత మరుగుదొడ్లు ఉన్నట్లు తేలింది.



★ ప్రధాని మోదీ సంసద్ ఆదర్శ్ గ్రామ యోజనలో భాగంగా 2014 అక్టోబరు 2న గాంధీ జయంతి సందర్భంగా స్వచ్ఛ భారత్ అభియాన్‌ను ప్రారంభించారు. గ్రామాల్లో ఆరోగ్యం, విద్య, మౌలిక సదుపాయాలు కల్పించాలన్న లక్ష్యంతో దేశంలోని ప్రతి ఎంపీ తన పరిధిలోని ఒక గ్రామాన్ని దత్తత తీసుకొని అభివృద్ధి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రారంభంలో కొంత హడావిడి కనిపించినా పూర్తి స్థాయిలో ఫలితాలు సాధించలేకపోయారు. ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వం ఆర్థిక సాయం అందించడంతో ప్రస్తుతం 72 శాతం వ్యక్తిగత మరుగుదొడ్లను నిర్మించుకున్నారు.

★ అచ్చంపేట మండలం బక్కలింగాయపల్లిలో వెయ్యి జనాభా ఉంది. తొలిసారి సర్పంచిగా ఎన్నికైన లక్ష్మీలాలునాయక్ కుమారుడు నవీన్‌కుమార్ ఎక్సైజ్ డీఎస్పీగా ఉన్న సమయంలో అప్పటి ఉమ్మడి జిల్లా కలెక్టర్ శ్రీదేవి సహకారంతో గ్రామాన్ని ఎంతో అభివృద్ధి చేశారు. నాటుసారా బట్టీలు ధ్వంసం చేసి ప్రజల ఆలోచనలో మార్పుతీసుకొచ్చారు. ప్రతి ఇంటికీ ఇంకుడు గుంత, వ్యక్తిగత మరుగుదొడ్డి ఏర్పాటు చేసుకున్నారు. శుద్ధజల కేంద్రంతో అందరికీ నీరందిస్తున్నారు. ఊళ్లో మూడు వేల మొక్కలు నాటి ప్రతి మొక్క సంరక్షణకు ట్రీగార్డును ఏర్పాటు చేయించారు. 7 ఎకరాల విస్తీర్ణంలో ప్రకృతి వనాన్ని ఏర్పాటు చేసి చక్కగా నిర్వహిస్తున్నారు.





మహబూబ్‌నగర్ : ఎంవీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బతుకమ్మలతో విద్యార్థినులు, అధ్యాపకులు

చిత్తూ చిత్తుల బొమ్మ..

శివుడి ముద్దుల గుమ్మ..

'చిత్తూచిత్తుల బొమ్మ... శివుడి ముద్దుల గుమ్మ... బంగారు బొమ్మ దొరికెనమ్మో ఈ వాడలోన..' వంటి బతుకమ్మ పాటలతో ఊరూవాడా నాట్యమాడుతోంది. తెలంగాణ సంస్కృతిలో భాగమైన బతుకమ్మ సంబరాలకు జిల్లా సన్నద్ధమైంది. దసరా సెలవుల కారణంగా విద్యాలయాల్లో కాస్త ముందే బతుకమ్మ సంబరాలు చేస్తున్నారు. ఉమ్మడి పాలమూరులో కొన్ని స్కూళ్లు, కళాశాలల్లో సందడి చూద్దామా.. - న్యూస్‌టుడే, బృందం



దేవరకద్ర: చౌదర్‌పల్లి వద్ద కళాశాలలో నిర్వహించిన వేడుకలో విద్యార్థులు, అధ్యాపకులు



ఉండవల్లి: అలంపూర్‌చౌరస్తాలో..





వెల్దండ: కొత్రతాండ సమీపంలో ఓ పాఠశాలలో.. పేట డిగ్రీ కళాశాలలో ఎమ్మెల్యే పర్ణిక



అచ్చంపేట: బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు

చదువులకు విరామం.. ఇళ్లకు పయనం







1. సొంత గ్రామాలకు వెళ్తున్న విద్యార్థులు 2. సీటు కోసం సర్కస్ ఫీట్లు 3.బస్సులో స్థలం లేక ఫుట్‌బోర్డుపై ప్రయాణం

గద్వాల పట్టణం, న్యూస్‌టుడే: పాఠశాలలకు దసరా సెలవులు ప్రకటించడంతో విద్యార్థుల చదువులకు కొన్ని రోజులు విరామం లభించింది. బుధవారం నుంచి సెలవులు కావడంతో ప్రభుత్వ, ప్రైవేటు వసతిగృహాల్లో ఉంటూ చదువుకుంటున్న వారు మంగళవారం ఇళ్ల బాటపట్టారు. ఈ నేపథ్యంలో గద్వాల ఆర్టీసీ బస్టాండ్‌లో కన్పించిన చిత్రాలే ఇవి.

కల్వకుర్తి పురపాలికకు స్వచ్ఛతా గుర్తింపు

కల్వకుర్తిపట్టణం, న్యూస్‌టుడే : కేంద్ర ప్రభుత్వం కల్వకుర్తి పురపాలికకు అవార్డు ప్రకటించింది. గత నెల 17నుంచి నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేయడంతో పుర సిబ్బంది, స్వయం సహాయక సంఘాల సభ్యులను ప్రభుత్వం అభినందించింది. తడి పొడి చెత్తను వేరుచేసి తిరిగి వినియోగంలోకి తెచ్చేందుకు డీఆర్సీ సెంటరును నిర్వహిస్తున్నారు. స్వయం సహాయక సంఘాల సభ్యులకు, పురకమిషనర్‌కు అవార్డు అందించనున్నారు. ఈ మేరకు కేంద్ర గృహనిర్మాణ, పట్టణాభివృద్ధి కార్యాలయం నుంచి పుర కమిషనర్‌కు సమాచారం అందించారు. బుధవారం దిల్లీలో జరిగే స్వచ్ఛభారత్ దివస్ కార్యక్రమంలో ప్రధాని మోదీ చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నారు. కమిషనర్ మహమూద్ షేక్, ఎస్‌హెచ్‌జీ అధ్యక్షురాలు స్వరాజ్యలక్ష్మి, సభ్యులు దిల్లీ బయలుదేరారు.

బాలికపై అత్యాచారం కేసులో నిందితుడికి జీవితఖైదు

మహబూబ్‌నగర్ నేరవిభాగం: బాలికపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తికి న్యాయమూర్తి జీవిత ఖైదు విధించారు. ఎస్పీ విజయ్‌కుమార్ కథనం ప్రకారం.. 2017లో కర్నూలుకు చెందిన విజయానంద్ ఓ బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. స్పెషల్ పోక్సో ట్రాక్ కోర్టు న్యాయమూర్తి శ్రీదేవి కేసు విచారణను పరిశీలించి సాక్ష్యాలతో విచారణ చేసి మంగళవారం తన తీర్పు వెలువరించారు. నిందితుడికి జీవిత ఖైదుతో పాటు రూ.20వేల జరిమానా విధించారు. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడటానికి కృషి చేసిన డీఎస్పీ వెంకటేశ్వర్లు, ఏపీపీ బాలస్వామి, అప్పటి సీఐ రామకృష్ణ, ఎస్సైలు గడ్డం కాశీ, విజయ్‌కుమార్, సీఐ గాంధీనాయక్, ఎస్సై బాలకృష్ణ, నాగిరెడ్డి, ఆశోక్‌రెడ్డిలను ఎస్పీ డి.జానకి అభినందించారు.

రాగి జావ ఇచ్చేదెలా?



'మింగ మెతుకులేదు.. మీసాలకు సంపెంగ నూనె' అన్న నానుడి సోమవారం కరీంనగర్ జిల్లా మానకొండూరులో పోషణ జాతర సందర్భంగా మంత్రి సీతక్క చేసిన ప్రకటన చూస్తే గుర్తుకొస్తోంది. అంగన్‌వాడీల్లో గర్భిణులు, చిన్నారులకు అదనంగా రాగిజావ ఇస్తామని మంత్రి చెప్పారు. ఇప్పుడు ఇస్తున్న [illegible] ప్రభుత్వం చెబుతున్న లక్ష్యాలకు [illegible] సరిపోని పరిస్థితుల్లో రాగిజావ ఎలా అందజేస్తారన్నది ప్రశ్న.

న్యూస్‌టుడే- నారాయణపేట న్యూటౌన్



ప్రస్తుతం ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు పౌష్టికాహారం కోసం రోజుకు ఒక్కొక్కరికీ 70 పైసలు అందజేస్తోంది. బాలింతలు, గర్భిణులు ఒక్కొక్కరికీ రూ. 1.50 చొప్పున ఇస్తోంది. ధన్వాడలో ఓ అంగన్‌వాడీ కేంద్రాన్ని తీసుకుంటే ఇక్కడ మొత్తం పది మంది పిల్లలు ఉన్నారు. వీరికి అదనంగా ఏడుగురు గర్భిణులు, ముగ్గురు బాలింతలు ఉన్నారు. వీరందరికీ రోజూ మధ్యాహ్నం పౌష్టికాహారాన్ని వండి అందించాల్సి ఉంది. ఈ లెక్కన పది మంది పిల్లలకు రోజుకు రూ.7, బాలింతలు గర్భిణులకు రూ. 15 ప్రభుత్వం అందజేస్తోంది. ఈ రెండింటినీ కలిపితే మొత్తం రూ. 22 ఇస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో కూరగాయల ధరలను పరిగణలోకి తీసుకుంటే రూ. 22కు పావుకిలో కూరగాయలు రావు. వీటితో 20 మందికి పౌష్టికాహారం వండి పెట్టాలంటే ఎలా సాధ్యమో ప్రభుత్వానికే తెలియాలి. ఉమ్మడి జిల్లాలోని అన్ని కేంద్రాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. కూరగాయల కోసం ఇస్తున్న నిధులు 'కొండ వంకాయ.. కొరికింది గుమ్మడి కాయ' చందాన్ని తలపిస్తున్నాయి.

● ఏదైనా ప్రభుత్వ కార్యక్రమాలు జరిగినప్పుడు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలనే ముందు పెడుతుంటారు. కొన్ని సందర్భాల్లో కొంతమందికి వండి వడ్డించాల్సి వస్తోంది. ఇది మరికొంత అదనపు భారం. కొంతమంది అంగన్‌వాడీ కార్యకర్తలు నిబద్ధతతో

● ఉమ్మడి పాలమూరు జిల్లాలో 5,548 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో సుమారుగా 2.80 లక్షల పిల్లలు, 40వేల దాకా బాలింతలు, గర్భిణులు ఉన్నారు. వీరందరికీ రోజూ మధ్యాహ్నం పౌష్టికాహారాన్ని అందించాలి. కూరగాయల కోసం ఇస్తున్న నిధులు చాలకపోవడంతో నిర్వాహకులు ఏ కూరగాయ తక్కువ ఉందో దాన్నే కొనుగోలు చేసి వడ్డిస్తున్నారు. మాటి మాటికీ వీటినే పెడుతుండటంతో పౌష్టికాహారం అనే మాటకే విలువే లేకుండా పోతోంది. కొన్ని కేంద్రాల్లో తక్కువ ధరకు వస్తాయని బజార్లలో రెండోరకం సరకు కొంటున్న సందర్భాలూ ఉంటున్నాయి. అధికారులు తనిఖీలకు వస్తున్నారని తెలిస్తే మాత్రం కొంత మెరుగ్గా భోజనం ఉంటుంది.

గతంలో వంట గ్యాస్ కోసం ఒక్కొక్క విద్యార్థికి రోజుకు రెండు పైసలు, బాలింతలు, గర్భిణులకు మూడు పైసలు చొప్పున ఇచ్చేవారు. కొన్ని సంవత్సరాలుగా వీటిని నిలిపేశారు. ప్రస్తుతం సిలిండర్ నిధులను నిర్వాహకులే భరించాల్సి వస్తోంది. గత ఏడాది నుంచి పోపు దినుసుల ప్యాకెట్లను అందజేస్తున్నారు. [illegible] సరిపోవడంలేదని నిర్వాహకులు వాపోతున్నారు. మళ్లీ బహిరంగ మార్కెట్‌లో కొనుగోలు చేయాల్సి వస్తోంది. కూరగాయలకు ఇస్తున్న నిధులు మరీ తక్కువగా ఉండటాన్ని గుర్తించకుండా నాణ్యమైన పౌష్టికాహారాన్ని వడ్డించాలని [illegible] అంగన్‌వాడీ కార్యకర్తలు అంటున్నారు.

ఉన్నంతలో మంచి ఆహారం అందించడానికి ప్రయత్నిస్తుండగా, కొన్నిచోట్ల పై నుంచి కింది స్థాయి వరకు చేతులు తడుపుతూ హాజరులో నమోదులో మతలబు చేసి పిల్లల కడుపు కొడుతున్నారు.

ప్రాణం తీసిన అరతులం బంగారం

తోడుగా ఉన్నవాడే నిందితుడు ● వీడిన మహిళ హత్య కేసు మిస్టరీ



కేసు వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రంగస్వామి

షాద్‌నగర్, న్యూస్‌టుడే: ఒంటరితనానికి ఒక తోడు దొరికిందనుకుంది ఆ మహిళ.. కానీ ఆ తోడే అర తులం బంగారం కోసం తన ప్రాణాలు తీస్తుందని ఊహించలేకపోయింది. షాద్‌నగర్‌లోని శ్రీనివాసకాలనీలో ఇటీవల కవర్‌లో దొరికిన మహిళ హత్య కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. మంగళవారం షాద్‌నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ రంగస్వామి, సీఐ విజయ్‌కుమార్‌లు కేసు వివరాలు వెల్లడించారు. చౌదరిగూడ మండలం ముష్టిపల్లి గ్రామానికి చెందిన ఒంటరి మహిళ భాగ్యలక్ష్మి(40) కొన్నేళ్లుగా ఫరూక్‌నగర్‌లోని అంబేడ్కర్ కాలనీలో నివాసం ఉంటూ కూలి పనులు చేసుకుంటూ జీవించేది. గద్వాల జిల్లా చాగాపూర్‌కు చెందిన వడ్డె రమేష్ తాపీ మేస్త్రీ. వ్యసనాలకు బానిసైన ఇతన్ని భార్యాపిల్లలు వదిలేయడంతో 8 నెలల క్రితం షాద్‌నగర్ వచ్చాడు. ఒకేచోట కూలిపనులు చేసే వీరిద్దరి మధ్య పరిచయం ఏర్పడి వివాహేతర సంబంధానికి దారితీసింది. ఒంటరిగా ఉన్న తనకు ఓ తోడు దొరికిందనే సంతోషంతో ఆమె అడిగినప్పుడల్లా అతడికి డబ్బులు ఇచ్చేది. ఆమె చెవులకున్న అర తులం బంగారు కమ్మలమీద కన్నేశాడు. ఈ క్రమంలోనే గత నెల 27న ఆమె గొంతు నులిమి హత్య చేశాడు. చెవికమ్మలతో పాటు ఇంట్లో ఉన్న రూ.5 వేల నగదు, సెల్‌ఫోన్ దొంగిలించి మృతదేహాన్ని కవర్‌లో చుట్టి శ్రీనివాసకాలనీలో పారేశాడు. సీఐ విజయ్‌కుమార్, డిటెక్టివ్ సీఐ ప్రశాంత్, ఎస్సైలు శరత్, సుశీల, శంకర్, సిబ్బంది జోత్స్న, నరేందర్‌లు బృందంగా ఏర్పడి మూడు రోజుల వ్యవధిలోనే నిందితుడిని పట్టుకున్నారు. ఈ సందర్భంగా కేసును వేగంగా పరిష్కరించిన పోలీసులకు ఏసీపీ నగదు రివార్డులు అందజేశారు.

అలంపూర్‌లో వైభవంగా ఉత్సవాలు : కలెక్టర్



అలంపూర్‌చౌరస్తాలో ఏర్పాటు చేసిన స్వాగత ద్వారం

గద్వాల కలెక్టరేట్, ఉండవల్లి, న్యూస్‌టుడే: జోగులాంబ అమ్మవారి సన్నిధిలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా నిర్వహించాలని కలెక్టర్ సంతోష్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐడీవోసీలోని కాన్ఫరెన్స్ హాల్లో దసరా ఉత్సవాలపై సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 3 నుంచి 12 వరకు నిర్వహించే ఈ ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలన్నారు. పుష్కర్‌ఘాట్ వద్ద అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పోలీసు, ఆరోగ్య, అగ్నిమాపక సేవలు అందుబాటులో ఉండాలని, ఉత్సవాల కోసం ఆర్టీసీ ప్రత్యేకంగా బస్సులను నడిపించాలన్నారు. విద్యుత్తు సరఫరాలో అంతరాయాలు లేకుండా ఆ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు, దేవాలయం చేరుకునే మార్గంలో రోడ్లకు మరమ్మతులు చేయాలని సూచించారు. ఆర్డీవో రాంచందర్, ఈవో పురేందర్, అధికారులు పాల్గొన్నారు.

● అలంపూర్‌చౌరస్తా, డి.బూడిదపాడు, భైరాపురం కూడలిలో ప్రవేశద్వారాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమాల వివరాలను ప్రవేశద్వారంపై పొందుపరిచారు.

సహకార సంఘాల బలోపేతానికి కృషి

మానవపాడు, న్యూస్‌టుడే: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల బలోపేతానికి అందరి సమన్వయ సహకారంతో తన వంతు కృషి చేస్తామని డీసీసీబీ ఛైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. బాధ్యతలు స్వీకరించాక.. తొలిసారిగా మానవపాడు సహకార సంఘం కార్యాలయాన్ని మంగళవారం సందర్శించారు. కలుకుంట్ల గ్రామానికి చెందిన ఓ రైతుకు రుణమాఫీ కాకపోవడంతో సొసైటీ అధికారులను నిలదీశారు. డీసీసీబీ డైరెక్టర్ రంగారెడ్డి, సొసైటీ ఛైర్మన్ శ్రీధర్‌రెడ్డి, అయ్యన్న, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



మహబూబ్‌నగర్ : బతుకమ్మ పాటలకు నృత్యం చేస్తున్న ఎంవీఎస్ విద్యార్థినులు



మహబూబ్‌నగర్ : ఎదిర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బతుకమ్మలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు



బాలానగర్ : బతుకమ్మలతో ఉపాధ్యాయులు



రాజాపూర్ : వేడుకలో ఉపాధ్యాయులు, విద్యార్థినులు

ఒక్కేసి పువ్వేసి చందమామ!

పాలమూరు, న్యూస్‌టుడే : మహబూబ్‌నగర్ పట్టణం క్రిస్టియన్‌పల్లి లోని ఎంవీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ముందస్తు బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించగా విద్యార్థినులు చీరలు ధరించి పాల్గొన్నారు. అధ్యాపకురాళ్లు, విద్యార్థినులు కలిసి బతుకమ్మలు తయారు చేసి ఆడిపాడారు. డీజే పాటలకు విద్యార్థులు నృత్యాలు చేశారు. కళాశాల ప్రిన్సిపల్ కె పద్మావతి, వైస్ ప్రిన్సిపల్స్ రవీందర్‌రావు, కృష్ణమూర్తి, అధ్యాపకులు సుభాషిణి, సురేశ్, సూర్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు. మహబూబ్‌నగర్ పురపాలిక ఎదిర ప్రభుత్వ ఉన్నత పాఠశాల, భూత్పూర్‌లో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. దేవరకద్ర పట్టణం, మండలంలోని పాఠశాలలు, కళాశాలలు, చౌదర్‌పల్లిలోని స్విట్స్ కళాశాలలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. మిడ్జిల్, బాలానగర్, రాజాపూర్, నవాబ్‌పేట, గండీడ్ మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థినులు, మహిళా బోధకులు బతుకమ్మ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఐకేపీ కార్యాలయాల వద్ద మహిళా సంఘాల సభ్యులు ఆడిపాడారు.



మహబూబ్‌నగర్ : నృత్యం చేస్తున్న ఎంవీఎస్ విద్యార్థినులు



మిడ్జిల్ : బతుకమ్మ వద్ద ఉపాధ్యాయురాళ్లు



నవాబ్‌పేట : పోమాల్ ప్రాథమిక పాఠశాలలో..



దేవరకద్ర : బతుకమ్మలతో మహిళలు

రాష్ట్ర స్థాయిలో రాణించాలి

జడ్చర్ల, న్యూస్‌టుడే : క్రీడల్లో ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలని జీహెచ్‌ఎం చంద్రకళ అన్నారు. బాదేపల్లి జడ్పీహెచ్‌ఎస్, సిగ్నల్‌గడ్డ పాఠశాల విద్యార్థులు విజేత, అఖిల, సునిత, హారతి రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 6 నుంచి మెదక్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. ఎంపికైన విద్యార్థులకు మంగళవారం అభినందించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు రాంకల్యాణ్, వడ్డెన్న, ఇబ్రహీం, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



మిడ్జిల్ : రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

మిడ్జిల్ : వస్పుల ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు వెంకటయ్య, పీడీ శంకర్ తెలిపారు. రాష్ట్రస్థాయి అండర్-17 హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైన స్వప్న, చరణ్‌కుమార్‌లను ఉపాధ్యాయులు అభినందించారు.

హన్వాడ : ఇటీవల నిర్వహించిన పాఠశాల స్థాయి క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, అధికారులు అభినందించారు. పెద్దదర్పల్లిలోని బీసీ గురుకులంలో ఆరు ఈవెంట్లలో ప్రతిభ చూపిన విద్యార్థులను తహసీల్దార్ కిష్ట్యానాయక్, ఎంపీడీవో యశోద, ఎంఈవో గోపాల్‌నాయక్ అభినందించారు. కొత్తపేట పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడు ఆంజిలయ్యతో పాటు విద్యార్థులను ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు.

ఫుట్‌బాల్ పోటీల్లో విజయం

కర్నూలు క్రీడలు: కర్నూలు నగరంలోని రిడ్జి ఉన్నత పాఠశాల మైదానంలో సీబీఎస్‌ఈ క్లస్టర్-7 ఫుట్‌బాల్ క్వాటర్ ఫైనల్స్ పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. అండర్-14 విభాగంలో హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, ఏపీ గన్నవరం జాన్సన్ పాఠశాల, మహబూబ్‌నగర్ సమర్థ పాఠశాల, హైదరాబాద్ లెర్నింగ్ సెంటర్, సన్‌ఫ్లవర్ పాఠశాలలు విజయం సాధించాయి.

తెరపై ఈనాడు

శ్రీనివాస - **దేవర,** బాలాజీ - **దేవర,** తిరుమల - **దేవర** వెంకటేశ్వర - **దేవర,** వెంకటాద్రి - **దేవర,** శ్రీకృష్ణ - **మత్తు వదలరా 2**

– న్యూస్‌టుడే, మహబూబ్‌నగర్ పట్టణం

వృద్ధులకు సన్మానం

జడ్చర్ల : జడ్చర్లలో మంగళవారం పలు చోట్ల వృద్ధుల దినోత్సవం నిర్వహించారు. 3వ వార్డులోని బీసీ గురుకులంలో కౌన్సిలర్ సతీష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ ఫోరం ప్రతినిధులు నయిమొద్దీన్, జమీలాబేగం, కాట్రపల్లి లక్ష్మయ్య, సత్యనారాయణరెడ్డి, ఆశీర్వాదం, మిరియాల వేణుగోపాల్, తదితరులను ఎంపీడీవో విజయ్‌కుమార్ సన్మానించారు. ప్రిన్సిపల్ రవిప్రకాశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతుల అభ్యున్నతే సహకార సంఘం లక్ష్యం

జడ్చర్ల, న్యూస్‌టుడే : రైతుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు సహకార సంఘం సభ్యులు ప్రకటించారు. జడ్చర్ల మండలం మల్లెబోయినపల్లిలో అధ్యక్షుడు పడాల మల్లేష్ ఆధ్వర్యంలో సహకార సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆదాయ, వ్యయాలపై చర్చించారు. సహకార సంఘ స్థలాన్ని అద్దెకు ఇచ్చి ఆదాయం పెంచేందుకు తీర్మానించారు. ఇక్కడ గతంలో పని చేసిన కార్యదర్శి జన్ను లక్ష్మణ్‌కుమార్‌కు రావాల్సిన వేతన బకాయిలు, డిపాజిట్ డబ్బుల చెల్లింపులపై చర్చించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి, మాజీ ఎంపీపీ బుర్ల వెంకటయ్య, డైరెక్టర్లు గోపాల్, తిరుపతయ్య, హన్మంతు, ఆడిటర్ సాధిక్ తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ మండల కార్యవర్గం

మిడ్జిల్, న్యూస్‌టుడే : మిడ్జిల్ మండల ఏబీవీపీ కన్వీనర్‌గా అజయ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన సమావేశంలో సహాయ కార్యదర్శులుగా పవన్, మేఘన, క్రీడల బాధ్యులుగా శేఖర్, సిద్దులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు శేఖర్, విష్ణు, పూజ, సుబ్బలక్ష్మి, వినోద్ పాల్గొన్నారు.

సాందీపని విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ



సాందీపని ఆవాసంలో విద్యార్థులకు దుప్పట్లను పంపిణీ చేస్తున్న నర్సింహారెడ్డి దంపతులు

పాలమూరు పురపాలకం : బండమీదిపల్లి సమీపంలోని సాందీపని ఆవాసంలో విద్యార్థులకు ధర్మాపూర్ మాజీ ఉప సర్పంచి, మండల కాంగ్రెస్ నాయకుడు నర్సింహారెడ్డి దంపతులు మంగళవారం దుప్పట్లు పంపిణీ చేశారు. విదేశాల్లో ఉండే తన కుమారుడి పుట్టిన రోజు సందర్భంగా ఏటా సాందీపని ఆవాసం విద్యార్థులకు చేయూత అందిస్తున్నట్లు వారు తెలిపారు. ఆవాసం అధ్యక్షుడు నారాయణరెడ్డి, నాయకులు మోహన్‌రెడ్డి, రామచంద్రయ్య, అనిల్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

వృద్ధాలతో కళాకృతుల తయారీ భేష్



ప్రదర్శనను తిలకిస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : స్వచ్ఛతా హి సేవా 2024 పక్షోత్సవాల్లో భాగంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో వ్యర్థాల నుంచి తయారు చేసిన కళాకృతుల ప్రదర్శనను జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి పరిశీలించారు. మంగళవారం డీఆర్‌డీవో, పంచాయతీరాజ్, విద్యాశాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రదర్శనను పరిశీలించి ఆయా పాఠశాలల విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఐసీడీఎస్ నవాబుపేట, పంచాయతీరాజ్ శాఖ, దేవరకద్ర మండలం పెద్దరాజమూరు ప్రాథమికోన్నత పాఠశాల, జడ్పీహెచ్‌ఎస్ ధర్మాపూర్, మంగలిగడ్డ తండా, బూరుగుపల్లి, రాజాపూర్ పంచాయతీ కార్యదర్శులు వీటిని ప్రదర్శించారు. అనంతరం నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

తైబజారు రద్దుపై చిరువ్యాపారుల హర్షం



సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి చిత్రపటాల వద్ద సంబరాల్లో చిరు వ్యాపారులు

భూత్పూర్, న్యూస్‌టుడే : భూత్పూర్ పురపాలక సంఘం పరిధిలో తైబజారు రద్దు చేయడంపై చిరు వ్యాపారులు హర్షం వ్యక్తం చేశారు. పట్టణంలో పండ్లు, కూరగాయలు, పువ్వులు, అల్పాహార కేంద్రాల్లోని సుమారు 50 మంది నిర్వాహకుల నుంచి రోజువారి వసూళ్లను నిలిపివేశారు. చిరు వ్యాపారులు మంగళవారం భూత్పూర్ కూడలిలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్, మాజీ ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి, నాయకులు బోరింగ్ నర్సిములు, జైదు శ్రీను, లిక్కి విజయ్, మశ్చందర్, అఫ్రోజ్ పాల్గొన్నారు.

బోర్డుల తరలింపు

బాలానగర్ : మండల కేంద్రంలో ఉపాధి హామీ కార్యాలయం సమీపంలో వివిధ గ్రామాల్లో చేపట్టిన పనులకు సంబంధించిన బోర్డులు ఉంచటంపై 'పనులు అక్కడ.. బోర్డులు ఇక్కడ' అనే శీర్షికతో ఈనెల 23న 'ఈనాడు'లో కథనం ప్రచురితం కాగా అధికారులు స్పందించారు. మంగళవారం కేతిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని చేపట్టిన ఉపాధి హామీ పనులకు సంబంధించిన బోర్డులను ట్రాక్టర్‌లో తీసుకెళ్లారు.

విధుల్లో అలసత్వం సహించం

గండీడ్, మహమ్మదాబాద్ : విధులను నిర్లక్ష్యం చేస్తే శాఖాపరమైన చర్యలు ఉంటాయని అదనపు డీఆర్‌డీవో ముజాహిదా బేగం హెచ్చరించారు. మంగళవారం 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు మండలంలో ఉపాధి హామీ పనులకు వెచ్చించిన దాదాపు రూ.7.40 కోట్లకు సంబంధించిన వివిధ రకాల పనులపై ఎంపీడీవో కార్యాలయంలో ప్రజావేదిక నిర్వహించారు. కొన్ని గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పనులను నిర్లక్ష్యం చేసినట్లు రికార్డుల్లో కనిపిస్తోందన్నారు. గ్రామాల వారీగా పరిశీలన అనంతరం పనుల్లో తప్పిదాలు చేసిన వారి నుంచి డబ్బులు రికవరీ చేయాలని ఆదేశించారు. 16వ విడత సామాజిక తనిఖీలో రూ.29,000 జరిమానా విధించగా, రూ.1,43,523 రికవరీ చేయాలని జిల్లా స్థాయి అధికారులు సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో నరేందర్‌రెడ్డి, జిల్లా విజిలెన్స్ అధికారి ప్రేమలత, అంబుడ్స్‌పర్సన్ సంతోష్, ఏపీడీ శ్రీపాద్, ఏపీవో హరిశ్చంద్రుడు, ఏవీవో శృతి, బీఆర్‌పీలు, వీఎస్‌ఏలు, పంచాయతీ కార్యదర్శులు, సాంకేతిక సహాయకులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకులను నియమించాలని వినతి

మహబూబ్‌నగర్ పట్టణం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బీఈడీ, డీఈడీ కళాశాలలో ఖాళీల్లో అతిథి అధ్యాపకులను నియమించాలని టీపీఆర్టీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు హర్షవర్ధన్ రెడ్డి జిల్లా కలెక్టర్ విజయేందిర బోయికి ఇచ్చిన వినతిలో పేర్కొన్నారు. గతంలో స్థానిక ప్రజాప్రతినిధుల జోక్యంతో విశ్రాంత అధ్యాపకులు, ఉపాధ్యాయులు, పీడీలతో వీటిని భర్తీ చేస్తూ ఉన్నత విద్య అభ్యసించి అన్ని అర్హతలు ఉన్న నిరుద్యోగులకు ఉపాధి లభించకుండా చేశారని పేర్కొన్నారు.

పేదల బస్తీలో అందని సర్కారు విద్య



పాలకొండతండా ప్రాథమిక పాఠశాల భవనం చుట్టూ పెరిగిన పిచ్చిమొక్కలు, చిత్రంలో ఇటీవల ఏర్పాటు చేసిన నీటి ట్యాంకు

పాలమూరు పురపాలకం, న్యూస్‌టుడే : పేదల బస్తీలో ప్రభుత్వ పాఠశాల మూతపడింది. సర్కారు విద్య దూరం కావడంతో భారమైనా తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపించాల్సి వస్తోంది. ఇది ఏ మారుమూల ప్రాంతంలోనో అనుకుంటే పొరపాటే. జిల్లా కేంద్రంలోని పురపాలక విలీన గ్రామం పాలకొండతండాలోనే ఈ దుస్థితి నెలకొంది. జిల్లా అధికార యంత్రాంగం కొలువుదీరిన కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో, ఎంపీ డీకే అరుణ నివాసానికి అత్యంత సమీపంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలకే ఈ పరిస్థితి ఎదురైంది. నాలుగేళ్ల క్రితం మూతపడిన ఈ పాఠశాలలో అమ్మ ఆదర్శ కమిటీ ద్వారా పనులు చేసేందుకు ఇటీవల నిధులు మంజూరు చేయటం మరో విశేషం. ఆ నిధులతో ఇక్కడి మరుగుదొడ్లకు పైపైన మరమ్మతులు చేసి రంగులు వేశారు. గదిపై నాసిరకం ప్లాస్టిక్ నీటిట్యాంకు ఏర్పాటు చేసి రెండు చోట్ల కుళాయిలు బిగించి బిల్లులు తీసుకున్నారు. ఈ పాఠశాలలో గతంలో పనిచేసిన ఉపాధ్యాయులు విద్యార్థుల సంఖ్య, విద్యా ప్రమాణాలు పెంచేందుకు చర్యలు తీసుకోలేదు. ఐదు తరగతుల్లో కలిపి 10 మంది విద్యార్థులు కూడా లేకుండా పోయారు. విద్యాబోధన సరిగ్గా లేకపోవటంతో అక్కడి పేదలు విధిలేక తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపించారు. ఈ క్రమంలోనే 2020లో 317 జీవో కింద ఈ పాఠశాలలో పనిచేస్తున్న ఏకోపాధ్యాయుడు మరో జిల్లాకు బదిలీ అయ్యారు. తర్వాత ఈ పాఠశాలకు విద్యాశాఖ ఉపాధ్యాయుడిని నియమించలేకపోయింది. అప్పటి నుంచి పాఠశాల మూతపడే ఉందని గిరిజనులు వాపోతున్నారు. ఇదిలా ఉంటే ఈ విద్యా సంవత్సరం ఉపాధ్యాయ బదిలీలు జరగగా పాలకొండతండా ప్రాథమిక పాఠశాలను ఖాళీల జాబితాలో చూపలేదు. వెబ్ ఆప్షన్స్‌లో పాఠశాలను బ్లాక్ చేయటంతో ఉపాధ్యాయులు ఈ పాఠశాలను ఎంపిక చేసుకునే అవకాశం లేకుండా పోయింది. ఇలా పాలకొండతండా పాఠశాల మూతపడేందుకు విద్యాశాఖే కారణమని చెప్పొచ్చు. ఈ విషయంపై మహబూబ్‌నగర్ అర్బన్ ఎంఈవో లక్ష్మణ్‌సింగ్‌ని 'న్యూస్‌టుడే' సంప్రదించగా జిల్లా విద్యాధికారితో మాట్లాడి ఒక ఉపాధ్యాయుడిని నియమించి పాఠశాలను తెరిపించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.



తరగతి గదిలో తుప్పుపడుతున్న బెంచీలు, ఇతర సామగ్రి

ఆసుపత్రిలో వైద్య విద్యార్థుల రక్తదానం

పాలమూరు, న్యూస్‌టుడే : మహబూబ్‌నగర్ ప్రభుత్వ వైద్య విద్యార్థులు మంగళవారం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమాన్ని డీఎంహెచ్‌వో డా. పద్మ, ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సంపత్‌కుమార్ సింగ్ తదితరులు ప్రారంభించారు. ఈ సందర్భంగా 51 మంది వైద్య విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఆర్‌ఎంవో డా.జరీనా, సీహెచ్‌వో రాముసాయక్, సహాయ ఆర్‌ఎంవో గణేశ్, పారిశుద్ధ్య అధికారి వెంకటేశ్, కురుమయ్య తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులు, చిత్రంలో డీఎంహెచ్‌వో, సూపరింటెండెంట్ తదితరులు

75వ వారం హనుమాన్ చాలీసా పారాయణం



నగర సంకీర్తన నిర్వహిస్తున్న భక్తులు

మహబూబ్‌నగర్ సాంస్కృతికం, న్యూస్‌టుడే: తూర్పు కమాన్ సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో మంగళవారం 75వ వారం హనుమాన్ చాలీసా పారాయణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దేవాలయం నుంచి పట్టణంలోని రాంమందిర్, పాన్‌చౌరస్తా తిరిగి దేవాలయం వరకు నగర సంకీర్తన నిర్వహించారు. దేవాలయంలో 11 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు, సీతారామాంజనేయ స్వామి సత్సంగ భక్తులు, భజన మండలి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సర్వీసు అంశాలు నమోదు చేయండి

పాలమూరు, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల సర్వీస్ విషయాలను వారి రిజిస్టర్‌లో నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని టీపీఆర్టీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు హర్షవర్ధన్‌రెడ్డి కోరారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో డీఈవో రవీందర్‌కు వినతి పత్రాన్ని అందించారు. ఉపాధ్యాయుల సర్వీస్ రిజిస్టర్లలో వార్షిక ధ్రువీకరణ, వార్షిక హెచ్చింపులు, సంపాదిత సెలవులు, సాధారణ నిధి బదిలీ, పదోన్నతులను నమోదు చేయకపోవటం వల్ల ఉద్యోగ విరమణ సమయంలో అనేక రకాల సమస్యలు వస్తాయన్నారు.

● అంజలి అనే ఉపాధ్యాయురాలి అర్హత ఉన్నా ఈ ఏడాది జూన్‌లో స్కూల్ అసిస్టెంట్ పదోన్నతి దక్కని వైనాన్ని టీఆర్టీయూ డీఈవో దృష్టికి తీసుకెళ్లింది. అర్హత జాబితాలో పేరు గల్లంతు కావటం వల్లనే ఇలా జరిగిందని గుర్తించి ఆమెకు పదోన్నతి కల్పించారు. సంఘం నాయకులు భూపతిసింగ్, ప్రభాకర్, శ్యామ్‌బాబు, రమాకాంత్, నాగిరెడ్డి, మల్లికార్జున్, వెంకటేశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అత్యాచారానికి పాల్పడిన వ్యక్తిపై కేసు

నవాబ్‌పేట, న్యూస్‌టుడే : వివాహితపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. ఓ వివాహిత ఇంట్లో ఒంటరిగా ఉన్న విషయం తెలుసుకున్న దండు మైబు అనే వ్యక్తి ఆమెను బెదిరించి అత్యాచారానికి పాల్పడినట్లు చెప్పారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

భూత్పూర్, న్యూస్‌టుడే : తాటికొండ స్టేజీ వద్ద జాతీయ రహదారిని దాటుతున్న వ్యక్తిని కారు ఢీకొనడంతో గాయాలయ్యాయి. మూసాపేట మండలం పోల్కంపల్లికి చెందిన శ్రీశైలం తన ద్విచక్రవాహనంపై మంగళవారం రాత్రి తాటికొండ వైపు నుంచి గ్రామానికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా కర్నూల్ వైపు వెళ్తున్న కారు ఢీకొంది. ప్రమాదంలో గాయపడిన అతడిని చికిత్స నిమిత్తం కారులోనే జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ఇసుక ట్రాక్టరు పట్టివేత

మిడ్జిల్, న్యూస్‌టుడే : మిడ్జిల్ గ్రామశివారు దుందుభి వాగు నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టరును పట్టుకున్నట్లు ఎస్సై శివనాగేశ్వర్‌నాయుడు తెలిపారు. సోమవారం అర్ధరాత్రి వాగు నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్నారని స్థానికులు చేసిన ఫిర్యాదు మేరకు సిబ్బంది దాడి చేసి ట్రాక్టరును అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. ట్రాక్టరు యజమాని, డ్రైవర్‌పై కేసు నమోదు చేశామన్నారు. ఇసుక అక్రమార్కులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇసుక మాఫియా దాడి? : ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేందుకు వెళ్లిన రైతు సురేందర్‌గౌడ్‌పై ట్రాక్టరు యజమానులు దాడి చేసినట్లు తెలిసింది. అర్ధరాత్రి వేళ పొలం మీదుగా ట్రాక్టర్లతో ఇసుక తరలిస్తుండగా అడ్డుకోగా దాడి చేసి తీవ్రంగా కొట్టినట్లు సమాచారం. ఈ మేరకు బాధితుడు పోలీసులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

జడ్చర్ల : తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడిన ఘటన జడ్చర్లలో మంగళవారం వెలుగు చూసింది. సీఐ ఆదిరెడ్డి కథనం ప్రకారం.. జడ్చర్ల పట్టణంలోని రంగారావుతోటలో నివాసముండే పెండ్యాల విష్ణుచారి సోమవారం ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో యాదగిరిగుట్ట పుణ్యక్షేత్రానికి వెళ్లారు. మరుసటి రోజు ఉదయం వచ్చి చూడగా తాళం ధ్వంసమై ఉంది. ఇంట్లో రూ.30వేల విలువైన ఎల్‌ఈడీ టీవీ, 40 తులాల బంగారు ఆభరణాలను లేవు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు.

పండగ వేళ అప్రమత్తంగా ఉండాలి : చోరీలు జరుగుతున్న నేపథ్యంలో దసరా వేడుకల కోసం సొంత గ్రామాలకు వెళ్లేవారు జాగ్రత్తలు తీసుకోవాలని సీఐ ఆదిరెడ్డి తెలిపారు. తాళం వేసి వెళ్లే ముందు బంగారు, వెండి, నగదు ఇంట్లో పెట్టకూడదన్నారు. చుట్టుపక్కల వారితో పాటు ఠాణాలో సమాచారం ఇవ్వాలని సూచించారు. దొంగలపై ప్రత్యేకంగా నిఘా పెట్టినట్లు చెప్పారు.